
## ఈవారం కథ

# కొడుకు

సూర్యశేఖర శివకుమార్



తెలతెలవారుతున్నది. బయట వర్షం టపటప కురుస్తున్న చప్పుడు రైలు చేసే శబ్దం కలిసిపోయి అదోమాదిరి లయబద్ధమైన సంగీతంలా వినిపిస్తున్నాయి.

స్టేషన్ సమీపిస్తున్నది అనటానికి గుర్తుగా చిన్న చిన్న ఇళ్ళు, రోడ్లు కనిపిస్తున్నాయి.

అతిథిని ఇంట్లోకి ఆహ్వానించే పెళ్ళివారిలా చెట్లు గాలికి తలలు వూపుతూ రైలును వూరిలోకి ఆహ్వానిస్తున్నాయి.

చిరుచలిగా అనిపించి మెడ మీద వున్న మఫ్లర్‌ను తల చుట్టూ కప్పుకుని బాత్‌రూమ్‌లోకి వెళ్ళి మొహం కడుక్కుని వచ్చారు రావుగారు.

60 ఏళ్ళ ఆయన వదనంలో జీవితంలోని ఎదురు దెబ్బలు, దైన్యవిషాదాలు ముడతలుగా దర్శనమిస్తున్నాయి.

"కాఫీ! కాఫీ" అని విన్పించిన కేకకు ఆయనలో కాఫీ తాగాలనే కోరిక పుట్టించింది. కాఫీ తాగాక కిటికీలోంచి బయటకు చూసి "అరె! దుర్గాపూర్ వచ్చిందే!" అనుకుంటూ బ్రీఫ్‌కేస్‌లో దుప్పటి, ఎయిర్ పిల్లో పెట్టి క్రింద వున్న షూ చూసుకుని వేసుకునే ప్రయత్నంలో పడ్డారు.

అప్రయత్నంగా ఆయన చేయి చొక్కా జేబులో వున్న ఇన్‌లాండ్ కవర్ తీసి ఆయనను కళ్ళజోడు పెట్టి ఆయనచే ఆ వుత్తరాన్ని చదివింప చేసింది.

రైలు ఎక్కాక ఆయన ఆ వుత్తరాన్ని ఏ పాతిక సార్లో చదివి వుంటారు. ఎందుకంటే ఆయనకు కొడుకు నుంచి వచ్చిన అపురూప వుత్తరం అది. అందులో పెద్ద విశేషము అంటూ ఏమీ లేదు.

"మీరు ఒకసారి ఇక్కడకు వచ్చి వెళ్ళండి" అని అంత అర్జంటుగా విషయం ఏమిటో ఆయనకు అంతు పట్టలేదు. అందులో కొడుకు పెళ్ళి అయిన 6 ఏళ్ళ నుంచి ఆయనకు వుత్తరం వ్రాయడం గానీ, ఆయనతో సామరస్యంగా మాట్లాడ్డం గానీ చేయలేదు. అందుకే ఆ వుత్తరం ఆయనకు అపురూపమైనది.

భార్య బ్రతికి వున్నప్పుడు ఏమోగానీ తన సరస్వతి చనిపోయాక కొడుకు మరల తన ఇంటి గుమ్మం తొక్కలేదు.

ఎప్పుడైనా కోడలు సుధను, మనవరాలు స్నిగ్ధను మాత్రం కలకత్తా పంపించేవాడు.

తండ్రి అంటే ఆ కొడుక్కి అపరిమిత ద్వేషం. మత్తుమందులకు అలవాటు పడిన గర్ల్‌ఫ్రెండ్‌తో తిరిగి తనుకూడా మత్తుమందులకు బానిస అయ్యాడు. అప్పుడు తను గవర్నమెంట్ డాక్టర్‌గా ఖరగ్‌పూర్‌లో జాబ్ చేసేవాడు.

వాళ్ళ కాలేజి ప్రిన్సిపాలు సకాలానికి తనను హెచ్చరించబట్టి వాడిని కాలేజీ మాన్పించి హాస్పిటల్లో ఎడ్మిట్ చేసి మామూలు మనిషి కావటానికి తను చాలా తిప్పలు పడవలసి వచ్చింది. చిన్నప్పటి నుంచి అంతే దుడుకు స్వభావంతో వాడు చేసే అల్లరికి తను నానా రకాలుగా బాధలు పడవలసి వచ్చింది.

లేక లేక పుట్టాడు కదా అని సరస్వతి వాడిని చాలా గారాబం చేసింది. దాని ఫలితం తాము ఇద్దరూ వాడు పెద్దయ్యాక చూడవలసి వచ్చినది.

వాడి చదువు పూర్తికాగానే తాము లక్షణమైన తెలుగింటి అమ్మాయిని చూసి పెళ్ళి చేశాడు. అది వాడి దృష్టిలో ఘోరమైన నేరం అయింది.

రావుగారు ఆలోచనల్లో మునిగి తేలుతుండగానే పోర్టర్లు బెంగాలీలో అరిచే అరుపులు విని ఈ లోకంలోకి వచ్చారు.

తన కోసం కొడుకు వచ్చాడేమోనని కంపార్టుమెంటు ద్వారం వద్దే నిలబడి ఆశగా ప్లాట్‌ఫాం అంతా కలియచూశారు. ఆయన ఆశ నిరాశ అయింది.

ఇంత వరకు తను ఎప్పుడూ దుర్గాపూర్ వెళ్ళలేదు. ఇల్లు తెలియదు అనుకుంటున్న ఆయనకు వెనక నుంచి ఎవరో అడ్డం లేవండి అన్న పిలుపుకు తప్పుకుని బ్రీఫ్‌కేస్, ఎయిర్ బేగ్ పట్టుకుని క్రిందకు దిగారు. జేబులో నుంచి లెటర్ తీసి ఎడ్రస్ ఇంకోసారి చూసుకున్నారు. కె. శ్రీమన్నారాయణ, బాలీబజార్, సెక్టార్–2. దుర్గాపూర్ అని వున్నది.

ఇంతలో స్వచ్ఛమైన తెలుగులో "మీరు ఎక్కడికి వెళ్ళాలి. ఇదేనా దుర్గాపూర్ రావడం, మీరు నన్ను గుర్తు పట్టలేకపోవచ్చు. మీరు డా. రావుగారు కదూ! మా అమ్మగారికి ఎపెండిసైటిస్ ఆపరేషన్ చేశారు"ఆపకుండా అంటున్నాడు ఎదురుగా వున్న ఓ యువకుడు.

"అవును నేను ఇదే మొదటిసారి రావటం. నేను బాలీబజార్ వెళ్ళాలి" అంటూ జేబులో వున్న ఎడ్రస్ తీసి చూపించారు.

"రండి వెళదాం" అని ఆ యువకుడు దారి తీయగా అతన్ని అనుసరించారు రావుగారు.

ఇంటి ముందు వేసిన రథం ముగ్గు తెలుగుదనానికి ప్రతీకలా వుంది. కోడల్ని మనసులోనే అభినందించారాయన. 'ఏ దేశమేగినా ఎందుకాలిడినా" మన సంస్కృతిని మరిచిపోకూడదు అనుకుంటూ చిన్నగా నవ్వుకున్నారు.

హాల్లోనే ఎదురయింది స్నిగ్ధ. ఫుల్ యూనిఫాంలో ముద్దుగా వుంది.రావుగారిని చూడగానే "అమ్మా తాతగారొచ్చేశారు" అంటూ కేక వేసింది.

సుధ బయటికి వచ్చింది. "రండి మామయ్యగారు. కాళ్ళు కడుక్కోండి. స్నానానికి నీళ్ళు వేడిచేస్తాను" అంటూ బాత్‌రూం చూపించింది.

"మీరు ఫోన్ చేసి వస్తే బావుండేది. నేను స్టేషన్‌కి వచ్చేదాన్ని. ఇల్లు కనుక్కోవడం ఇబ్బంది కాలేదుకదా" ఆ మాటకి మ్రాన్పడిపోయారు.

"మరి శ్రీ వుత్తరం వ్రాశాడు కదా!" అన్నారు.

"ఆయన వూరు వెళ్ళి 15 రోజులు అయిం


శ్రీచక్ర సిమెంట్ నే వాడండి



సిరులు పొందండి!

SHREE CHAKRA CEMENT

ULTIMATE PROTECTION

శ్రీచక్ర సిమెంట్

43 GRADE

GOLDSTAR CEMENTS LTD.
NARASIMHAPURI, GUNTUR DIST.

GOLDSTAR GROUP OF INDUSTRIES
GOLDSTAR CHAMBERS, AMEERPET, HYDERABAD - 500 016.

అత్యుత్తమ రక్షణ

దండి" అన్నది సుధ మెల్లిగా. మరి ఈ వుత్తరం మాటేమిటి? జేబులోంచి వుత్తరం తీసి ఇచ్చారు.

"ఆది ఆయన దస్తూరీ కాదండి! మీ అబ్బాయి చేతివ్రాత మీకు తెలుసుగదా!" అన్నది. సుధ మాట వూర్తికాకుండానే పైఫ్లాట్‌లో వున్న బెంగాలీ ఆయన వచ్చాడు.

నమస్కారం అని మొదలు పెట్టి అచ్చ తెలుగులో స్వచ్ఛంగా చెప్పాడాయన. "నేను ఈ ఇంటికి వచ్చి 6 నెలలు అయింది. వచ్చినప్పటి నుండి చూస్తున్నాను. సుధా బేటి పడే నరకం. 4 రోజులకు ఒకసారి అయినా మీ అబ్బాయి మీ కోడల్ని నానారకాలుగా బాధపెడతాడు. అది దేని గురించో నాకు అర్థం కాదు. కట్నం గురించి కావచ్చు అని మా ఆవిడ నేమా అనుకున్నాను. కానీ అటువంటిది ఏమీ లేదు అని సుధ చెప్పింది. అసలు మీ సన్ ఎందుకు అలా క్రూయల్‌గా బిహేవ్‌గా చేస్తాడో నాకు అర్థం కాలేదు. అతను ఒళ్ళు తెలియక ఇంట్లో ఏది పడితే అది విసిరి గొడుతున్నాడు. దీన్ని ప్రత్యక్షంగా చూస్తూ ఏం చెయ్యాలో తెలియక నేనే మీకు ఈ లెటర్ వ్రాశాను. మొన్న ఫ్లవర్‌వేజ్ విసిరిగొడితే సుధకి తలకి కుట్లు పడ్డాయి. అది చూసి నేను మీ అబ్బాయిని మందలించాను'

"నా మాట వినకపోతే పోయాడు. కానీ నన్నో వురుగును విదిల్చినట్టు విదిలించాడు. ఇక్కడ చాలా మందికి మీ అబ్బాయితో ఇలాంటి అనుభవం ఎదురైంది. అసలు మేమంతా కలిసి పోలీస్ రిపోర్ట్ ఇవ్వాలనుకున్నాము. కానీ సుధ వారించింది. అందుకే మీకు ఈ వుత్తరం వ్రాయాల్సి వచ్చింది. మాక్కూడా ఇది కొంచెం న్యూసెన్స్‌గానే వుంది" సగం నిండా నిష్ఠూరాలతో అన్నాడాయన.

"నాకు సౌత్ లాంగ్వేజిలతో పరిచయం వుంది. నేనుఇక్కడి ఆకాశవాణిలో పని చేస్తున్నాను. అసలు మీకు ఫోన్ చేద్దామనుకున్నాను. ఫోన్ అయితే కంగారు పడతారు అని లెటర్ వ్రాశాను" అన్నాడు అతను.

వెళ్ళే ముందు 'క్షమించండి' అని చెప్పి వెళ్ళిపోయాడు అతను. అంతా విని సుధ వంక చూశారు రావుగారు. ఆమె వంచిన తల ఎత్తలేదు. అలాగే నుంచుండి పోయింది.

"ఇంతకాలం నాకు తెలియజెయ్యలేదు" అన్నారు రావుగారు. "మీకు తెలియజేస్తే బాధపడతారు. ఒకసారి పెరాలిసిస్‌వచ్చి తగ్గింది కదా. ఇలాంటివి వింటే తట్టుకోలేరు"అందుకని చిన్నగా అంది సుధ.

"ఈ మధ్యన మరీ ఎక్కువయింది.మత్తు ఇంజక్షన్ తీసుకోకుండా వుండలేకపోతున్నారు. ఇలాంటివి తెలియడం వలన లాభం కన్నా నష్టమే ఎక్కువ. అత్తయ్యగారు వుంటే ఆమె మాట కొంచెమైనా వినేవారు" - సుధ.

రావుగారు విషాదమంతా గాలికి తగిలిన మేఘమై వర్షించనారంభించింది. కోడలికి తెలియకుండా తుడుచుకున్నారు. ఆరేళ్ళ స్నిగ్ధ "ఎందుకు తాతయ్యా! ఏలుస్తున్నావు" అంటూ తన చిట్టి చేతులతో తుడవబోయింది.

"నా మనసు బాగా లేదు అలా బయటికి వెళ్ళి వస్తాను" అంటూ స్నిగ్ధను తీసుకొని బయటికి వెళ్ళిపోయారు.

** ** **

అర్ధరాత్రి. ఎక్కడో ఫ్యాక్టరీలో సైరన్ కూసిన మోత ఆ మోతకు మెలకువ వచ్చిన రావుగారు మంచినీళ్ళ కొరకు లేవబోతుండగా కాలింగ్ బెల్ మోగింది. ఎవరా అని విండో లోంచి చూసిన ఆయన శ్రీమన్నారాయణ ఆకారం మసక మసగ్గా కనిపించింది. తలుపు తీశారు.

తూలుత లోపలికి వచ్చాడు ఆయన పుత్రరత్నం శ్రీమన్నారాయణ. ఇప్పుడు మాట్లాడినా ఏమీ లాభం లేదని మాట్లాడించకుండానే లోపలికి వెళ్ళిపోయి పడుకున్నారు రావుగారు.

ఛ! ఒక్కగానొక్క కొడుకు. లేక లేక పుట్టాడు. అని సరస్వతి గారాబం చేసింది. చదువుకొనే రోజుల్లో ఆ వయసులో చేసే అల్లరి చేశాడు. ఎప్పుడూ కాలేజి గొడవలు ఇంటిదాకా తెచ్చేవాడు. సరస్వతి వీడిని ఏమైనా అననిస్తే కదా! ఎప్పుడూ వీడి తప్పడు పనులు అన్నీ దాచి పెట్టేది సరే! అనుకున్నదేమిటి జరిగిందేమిటి. అనవసరంగా సుధ భవిష్యత్తు నాశనం చేశాను. సుధను, స్నిగ్ధను తనతో తీసుకుపోతే అనుకున్నాడాయన. ఏముంది అక్కడకు వచ్చి గొడవ చేస్తాడు. ఇక వాడు మారడు.

ఆయన ఆలోచనల్లో వుండగానే వంట ఇంట్లో ఏదో చప్పుడు వినిపించింది. స్నిగ్ధ ఏడుపో సుధ ఏడుపో ఆయనకి వెంటనే అర్థం కాలేదు.

ఆయన వంటింట్లోకి వెళ్ళేసరికి నేను ఫ్రిజ్‌లో పెట్టిన ఇంజక్షన్ వైల్సు ఏమయ్యాయి. చెప్ప, అంటూ సుధ జడ పట్టుకుని గుంజాడు. అడ్డువచ్చిన స్నిగ్ధను ఒక్క తోపు తోసేసరికి ఆ పాప వెళ్ళి అక్కడ వున్న వెట్ గ్రైండర్ మీద పడింది.

ఇక రావుగారు ఆవేశాన్ని అణచుకోలేకపోయారు. 'నీవు మనిషివా రాక్షసుడివా నిండా ఆరేళ్ళు లేని పసిదాన్ని పొట్టన పెట్టుకుంటున్నావు దుర్మార్గుడా!' అంటూ పాపని లేవదీసి బెడ్‌రూంలోకి తీసుకెళ్ళి ఫస్టెయిడ్ చేయసాగారు.

దెబ్బ తగిలిన పాపని చూడకనే ఇంజక్షన్ వైల్సు కోసం సుధని వేధించ నారంభించాడు.

"ఆ ఇంజక్షన్స్ నేనే తీసి దాచాను. అసలు సొసైటీలో నీలాంటి వాళ్ళే అసలయిన క్రిమినల్స్ దేనికో దానికి బానిసలు అవడం కుటుంబ సభ్యులను వేధించడం. మీరు బాధపడడం. నేను నీకు ఆ ఇంజక్షన్ చేస్తాను. ఇప్పడయినా శాంతించు స్నిగ్ధని అలా పడేశావు. సీరియస్ అయితే ఎలా వుండేది" అన్నారు.

మంత్రించిన వాడిలా శ్రీమన్నారాయణ వెళ్ళి మంచం మీద పడుకున్నాడు. రావుగారు ఒక స్థిర నిర్ణయానికి వచ్చారు. కొడుక్కి ఒక ఇంజక్షన్ చేశారు.

ఇక తెల్లవారి శ్రీమన్నారాయణ ఈ ప్రపంచాన్ని చూడలేదు.

రావుగారు తను చేసిన ఇంజక్షన్ బాటల్‌ను పట్టుకొని తిన్నగా పోలీస్ స్టేషన్‌కి నడిచారు ●

ఓ కాలేజీ లెక్చరర్ రాస్తున్న సీరియల్
త్వరలో....
స్వీట్ సె×'టీన్